క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పేరవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని పేరవరంలో సీసీ రోడ్ నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వేగవంతం చేశామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భేరి వరలక్ష్మి, భేరి అరవిందకుమార్, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, సాదే లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ



పంచాయతీ స్థలంలో నిర్మించిన భవనం

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో కొందరు పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారు. ఇటీవల పంచాయతీ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి రాత్రికి రాత్రే శ్లాబ్ వేశారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల ప్రమేయంతో పంచాయతీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా పంచాయతీ స్థలం ఆక్రమణకు గురికావడంతో ప్రతి మంగళవారం జరిగే సంత నిర్వహణకు ఆటకం కలుగుతోందని సంత నిర్వాహకులు, వినియోగదారులు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



పాతచోడిపల్లిపేట మల్లేష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ పాత చోడిపల్లిపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న శీలం మల్లేష్‌కు వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మలేష్ అనారోగ్యం కారణంగా ఇటీవల ఓ కాలు తొలగించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రివర్యులు దాడిశెట్టి రాజా తక్షణమే తన వంతుగా రూ.20 వేలు పంపారు. ఈ నగదును వైస్ ఎంపీపీ నాగం గంగ బాబు బాధితుడికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గాబు రాజు, ఎంపీటీసీ అంబుజాలుపు అప్పలరాజు, పార్టీ నాయకులు చందక సూరిబాబు, దుళ్ల సత్తిబాబు, చందక ఏసుబాబు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ప్రత్తిపాడు: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. ప్రత్తిపాడులో ఆదివారం సాయంత్రం బీజేపీ పోలింగ్ బూత్ స్వశక్తీకరణ అభియాన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను గ్రమాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. బూత్ స్థాయిలోని ఓటరు జాబితాలను బూత్ కమిటీలకు అందజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాట్ల సూర్యనారాయణరాజు, శింగిలిదేవి సత్తిరాజు, కర్రి ధర్మరాజు, జిల్లా కార్యదర్శి గండి కొండలరావు, కొల్లా శ్రీనివాస్, జి. రాజబాబు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

గోకవరం: కొత్తపల్లిలోని ఆదర్శ విద్యాసంస్థల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గత నాలుగు రోజులుగా ఆదర్శ ఫార్మసీ కళాశాల, పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ పి.కనకరాజు, సెక్రటరీ పి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హారిక ప్రవల్లిక, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన లేమి.. పర్యావరణానికి హాని

- గ్రామాల్లో విరివిగా చెట్ల నరికివేత
- పూర్తిస్థాయిలో అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అల్లిపూడి రోడ్డులో నరికి వేసిన చెట్టు

కోటనందూరు: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా వన మహోత్సవాల పేరుతో రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు, అడవుల పెంపకం చేపడుతోంది. కాగా కొంమంది స్వార్థపరులు ప్రభుత్వ స్థలాల్లో పెంచిన చెట్లను నరికేస్తూ పర్యావరణానికి హాని చేస్తున్నారు. సోషల్ ఫారెస్టు, ఉపాధి హామీ పథకంలో పెంచిన చెట్లను నరికేసి గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్వార్థపరులు రెచ్చిపోతున్నారు. మరో పక్క మానవ మనుగడకే పెను సవాల్‌గా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడంలో సైతం అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. పర్యావరణానికి హాని చేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

183 పంచాయతీల పరిధిలో...

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలో 183 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో గ్రామీణ, పట్టణ రోడ్లకు ఇరువైపులా సోషల్ ఫారెస్టు, ఉపాధిహామీ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటి చెట్లగా పెంచారు. పెరిగిన చెట్లు ప్రజలకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పిస్తూ పర్యావరణానికి అండగా నిలుస్తున్నాయి. మరోపక్క పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని కొంతమేర పాటిస్తున్నా.. పల్లెల్లో మాత్రం పట్టించుకోవడం లేదు. కిరాణా, కూరగాయలు, మాంసం, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో యథేచ్ఛగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను సరఫరా చేస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లులను యథావిధిగా వినియోగిస్తున్నారు. పంచాయతీల పరంగా గ్రీన్ అంబాసిడార్లు సేకరించే చెత్తలో అధిక శాతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉండడం గమనార్హం. గ్రామ శివార్లలో సైతం ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా దర్శనమిస్తున్నారు. నదులు, చెరువులు, కాలువల్లో సైతం భారీగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పేరుకుపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవగాహనతోనే..



తాండవ నదిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి, మానవ మనుగడకు వాటిల్లే అనర్థాలపై అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. చెట్ల పెంపకం, ప్లాస్టిక్ నిషేధంలో విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, డ్వాక్రా సంఘాలు, విద్యావంతులను భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకోవాలి. పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా చెట్ల నరికివేతను, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టే అవకాశం ఉంటుందని పర్యావరణ ప్రియులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కాలచక్రంలో అసమానతలను తొలగించాలంటే ప్రజలు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. మానవ మనుగడకు పెను సవాలుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. ప్రజలు చెట్ల నరికివేతను, ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలి.

– లెక్కల స్వామినాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, జగన్నాథపురం

చెట్లు నరికితే కఠిన చర్యలు



పర్యావరణ పరిరక్షణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పబ్లిక్ ప్రాంతాల్లో చెట్లు నరికినా, ప్లాస్టిక్ వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటాం. దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తప్పవు. ప్లాస్టిక్ వినియోగంపై మెరుపుదాడులు నిర్వహిస్తాం.

– జి.అరుణ్‌కుమార్, ఈఓపీఆర్డీ, కోటనందూరు

తునిలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



తునిలో జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి రాజా

తుని: అత్యవసర వైద్య సేవల కోసం తునిలో మమత మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం తుని రెడ్ కాన్వెంట్ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన మమత మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజాతో కలిసి ఆయన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తునిలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన, అత్యవసర వైద్య సేవలు అందుతాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివిధ విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. తొలుత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, మండల పార్టీ అధ్యక్షుడు పోతల రమణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, తుని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాఘునాథరావు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ క్వాజా, పాయకరావుపేటకు చెందిన తోట నగేష్, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 70 మంది చేరిక



జగ్గంపేటలో వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి కండువాలు వేసిన జ్యోతుల రామస్వామి

జగ్గంపేట: స్థానిక కోనేటి వీధి గొల్లపేటకు చెందిన 70 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా సారథ్యంలో వీరు పార్టీలో చేరగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక పరిపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని జ్యోతుల రామస్వామి వారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, కోనేటి వీధికి చెందిన యువ నాయకులు కొల్లుబోయిన రాజేష్, లక్ష్మణరావు, ముచ్చల వీర వెంకటరావు, పల్లా అయ్యప్ప, పెండ్యాల బాబి, కొల్లుబోయిన తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

జగ్గంపేట: మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. మండలంలోని రాజపూడి చల్లా నాగేశ్వరరావు కల్యాణ మండపంలో సంఘ జిల్లా అధ్యక్షుడు తోట సూర్యసుబ్బారావు ఆధ్వర్యంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను సుబ్బారావు వివరించారు. సంఘ మండల నూతన అధ్యక్షుడిగా మంచాల హేమాద్రి ప్రసాద్, కార్యదర్శిగా నకిరెడ్డి విష్ణు చక్రరావు, కోశాధికారిగా గెద్దం అచ్చిరాజు, జిల్లా సభ్యులుగా పితాని చిట్టిబాబు, మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల రాజేష్, కార్యదర్శి కొమరం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఈ నెల 18 వరకూ జరగనునుండడంతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఏలేశ్వరం మండలంలోని ఏలేశ్వరంలో మూడు, లింగంపర్తి ఒక కేంద్రంలో 861 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండల కేంద్ర మైన ఏలేశ్వరంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాష్యం స్కూల్, లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 199 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఈ కేంద్రం సూపరింటెండెంట్‌గా వట్టి వెంకటరమణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులు, సూపరింటెండెంట్‌గా వనమా శ్రీరామమూర్తి, భాష్యం స్కూల్‌లో 218 మంది విద్యార్థులు సూపరింటెండెంట్‌గా ధర్మరాజు, లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 198 విద్యార్థులు సూపరింటెండెంట్‌గా ఎస్‌జే లక్ష్మణరావు వ్యహరించనున్నారు. విద్యార్థులు అర గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ బి.అబ్బాయి సూచించారు.

తొండంగి: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో షేక్‌బాబ్జీ ఆదివారం తెలిపారు. తొండంగి, పెరుమాళ్లపురం, బెండపూడి, దానవాయిపేటలో పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. తొండంగి జెడ్పీ హైస్కూల్లో 240 మంది, దానవాయిపేట జెడ్పీ హైస్కూల్లో 250 మంది, పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో 290, బెండపూడి జెడ్పీ హైస్కూల్లో 200 మంది వెరసి మొత్తం 980 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తారని చెప్పారు. అన్ని సెంటర్లలోనూ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

కిర్లంపూడి: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు. మండలంలోని కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు, బూరుగుపూడి, తామరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నాలుగు సెంటర్లు, ప్రగతి ప్రైవేట్ పాఠశాలలో మరో సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఐదు పరీక్ష కేంద్రాల్లో 953 విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

‘పద్మశ్రీ’ గ్రహీత చింతలపాటికి సన్మానం



పద్మశ్రీ పురస్కార గ్రహీత వెంకటపతి రాజును సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఆదివారం పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతలపాటి వెంకటపతిరాజు పర్యటించారు. స్థానిక తపాలా కార్యాలయంలో వెంకటపతిరాజును అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేపకాయల వీర్రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి భూలోకం ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తపాల ఉద్యోగులు కోటి, దుర్గ, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

తపోవనంలో మహాలింగార్చన

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం మహాలింగార్చన నిర్వహించారు. తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీస్వామీజీ ఆధ్వర్యంలో భాగ్యనగరం మహాలింగార్చన సమితివారు సపరివారంగా తపోవనం వచ్చి చైత్రమాస మహాలింగార్చన, గురువందనం చేశారు. కార్యక్రమంలో పలువురు వేదపండితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం వితరణ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ ఐవీ రోహిత్ జన్మదినం సందర్భంగా స్థానిక మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు ఆయన అభిమానులు ఆదివారం మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. పండ్లు, డ్రింకులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వీర్ల సూరిబాబు బర్త్‌డే కేక్ కట్ చేశారు. శంఖవరం వైస్ ఎంపీపీ ధారా వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ‘ప్రేమతో నాన్న’ నాటిక



‘ప్రేమతో నాన్న’ నాటికలో ఓ సన్నివేశం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో రామాలయం నిర్మించి వందేళ్లు పూర్తి కావడంతో పాటు శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ప్రదర్శించిన ప్రేమతో నాన్న నాటిక ప్రేక్షకులను అలరించింది. అత్తారింటిలో భర్త వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చిన కూతురిని తండ్రి ఆదుకున్న ఇతివృత్తంతో సాగింది ప్రేమతో నాన్న నాటిక. కొలకలూరి సాయిఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికకు గోపరాజు విజయ్ దర్శకత్వం వహించగా విజయార్కే రచన అందించారు. రెండో ప్రదర్శనగా అందిన ఆకాశం నాటిక ప్రదర్శించారు. ప్రేమపేరుతో మోసపోయిన స్త్రీ తనబిడ్డను ప్రయోజకుడిగా చేయడమే ప్రధానాంశంగా ఈ నాటకం సాగిందీ. హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటికకు ఎస్ఎం బాషా దర్శకత్వం వహించగా, రచన అనంతహృదయరాజ్ అందించారు. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీలు సోమవారంతో ముగుస్తాయి.

కల్తీ మాంసం విక్రయాలు అరికట్టాలంటూ ర్యాలీ



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: కల్తీ మేకమాంసం విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఆదివారం సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఎంపీపీ పాఠశాల వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ గోకవరంలో ఇటీవల కల్తీ మేకమాంసం విక్రయాలు పెరిగిపోయాయని ఆరోపించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని ఎంపీపీ పాఠశాల ప్రహరీని ఆనుకుని మేకమాంసం దుకాణం నిర్వహిస్తున్నారని, వ్యర్థాలను శుభ్రం చేయకపోవడం వలన విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. దీనిపై నాలుగు రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆందోళన కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై యువి శివనాగబాబు అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర, పెద్దాడ వెంకన్నదొర, అరిసెపు రాంబాబు, తోట సాయిబాబు, మచ్చా మోహన్, రాజు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: మండల పరిధిలోని కృష్ణవరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తదేకం ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ మండలాధ్యక్షులు ఉలిసి అయిరాజ్ ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు 382 మందికి పరీక్షలు చేశారు. వీరిలో కొందరికి సబ్సిడీపై కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్, పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాగుణంతో చరిత్రలో చిరస్థానం



కాట్రావులపల్లి ధర్మసత్రంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: చరిత్రలో చిరస్థాయిగా నిలిచేది సేవాగుణం ఒక్కటేనని రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో పానుగంటి లక్ష్మీ వెంకాయమ్మ ధర్మసత్రం 137వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ ధర్మసత్రం ద్వారా నేటికీ పేదలు, వృద్ధులు, వికలాంగులకు అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సత్రం ఈఓ ఎంఎస్ఎస్ఎస్ శర్మ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, నాయకులు కంటే రామారావు, ఐఆర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివెరిసిన మానవత్వం



కైలాసరథంలో మృతదేహాన్ని రాజమహేంద్రవరం తరలిస్తున్న దృశ్యం

జగ్గంపేట: స్థానిక కోనేటి వీధిలో నిరుపేద మహిళ సారిపల్లి వీరమ్మ ఆదివారం మృతి చెందింది. ఆమెకు అంతిమ సంస్కారాలు చేసేవారు ఎవరూ లేకపోవడంతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ఔదార్యం చూపారు. కైలాస రథం ఏర్పాటు చేసి మృతదేహాన్ని రాజమహేంద్రవరంలోని కైలాసభూమికి తరలించారు. తన అనుచరులను పంపి దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ సభ్యులు ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజ్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యాలయాల ముట్టడి

తొండంగి: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం స్పందించని కారణంగా సోమవారం నిర్వహించే బీజేపీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కింతాడ సత్తిబాబు కోరారు. ఒంటిమామిడిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీవర్గీకరణ చేస్తామని ప్రకటించిందన్నారు. నేటికీ దీనిపై స్పందించకపోవడంతో నిరసనగా బీజేపీ కార్యాలయాల ముట్టడికి పిలుపు నిచ్చామని తెలిపారు.

ఇక పార్కింగ్ స్థలంలోనూ కూల్ కూల్



రత్నగిరిపై వాహనాల పార్కింగ్ స్థలంలో వేస్తున్న కూల్ పెయింటింగ్

అన్నవరం: ప్రస్తుత వేసవిలో రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు వేసవి తాపం నుంచి రక్షణ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రత్నగిరిపై భక్తుల కాళ్లు కాలకుండా ఇప్పటికే మెట్లకు కూల్ పెయింటింగ్ వేశారు. కాగా ప్రస్తుతం వాహనాల పార్కింగ్ స్థలంలోనూ కూల్ పెయింట్ వేస్తుండడంతో భక్తులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రామాలయం చుట్టుపక్కల గల ఆలయ ప్రాంగణంలో మాత్రమే కూల్ పెయింటింగ్ వేసేవారు. వాహనాల్లో వచ్చేవారు తమ వాహనాలను పార్కింగ్ స్థలాల్లో నిలిపి ఆలయ ప్రాంగణంలోకి వచ్చేసరికి కాళ్లు కాలిపోయి ఇబ్బందులు పడేవారు. ఈ ఏడాది వాహనాల పార్కింగ్ స్థలంలో కూడా కూల్ పెయింటింగ్ వేస్తుండడంతో భక్తులకు కొంతమేర ఊరట కలగనుంది.

ఘనంగా మట్టల ఆదివారం



ఏలేశ్వరంలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



తంటికొండలో క్రైస్తవుల ర్యాలీ

ఏలేశ్వరం: పట్టణంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి పాస్టర్ శ్యామూల్ రవికుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెం లూథరన్ చర్చి నుంచి బాలాజీ చౌక్, మెయిన్ రోడ్ మీదుగా మట్టలతో ర్యాలీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పేకల జాన్, వత్సలరావు, గణేష్, రాణి, రవికుమార్, అర్చన,ప్రమీల, స్వర్ణకుమారి, సంఘస్తులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని తంటికొండలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో కైస్తవులు మట్టలతో ర్యాలీ చేశారు. గోకవరంలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్ఎస్ చర్చి, రంపయర్రంపాలెంలోని సెయింట్ పీటర్ లూథరన్ చర్చితో పాటు పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.